## నేడు స్వగ్రామానికి డిప్యూటీ సీఎం రాక

వైరా రూరల్, ఫిబ్రవరి 24: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం రానున్నారు. ఇటీవల మృతిచెందిన తన సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు దశదిన కర్మకు భట్టి విక్రమార్క–నందిని దంపతులు హాజరవుతారు.

## 'ప్రియదర్శిని'లో ఫుడ్ ఫెస్టివల్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24: నగరంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతూ... ఇలాంటి కార్యాక్రమాలు విద్యార్థుల్లో మేనేజ్‌మెంట్ యాక్టివిటీ, మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. 35 స్టాల్స్, 120 రకాల వంటలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ రామారావు, మద్దినేని వెంకటేశ్వరరావు, విల్సన్, ఎం శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'శ్రీచైతన్య'లో ఫ్యామిలీ ఫెస్ట్...

నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ఫ్యామిలీ ఫెస్ట్ నిర్వహించారు. అంతరించి పోతున్న కుటుంబ వ్యవస్థ, మానవ విలువలు కాపాడాలని డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య అన్నారు. చిన్నతనం నుంచే వినయం, విధేయత అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువకుడు మృతి

కారేపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామస్తుడు లావుడియా రాంబాబు (23) ఈ నెల 14న చేను వద్ద పురుగుల మందుతాగి, కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పాడు. అప్పటి నుంచి ఖమ్మం ప్రధానాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదుతో ఎస్సై రాజారాం కేసు నమోదు చేశారు.

## ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

వైరా టౌన్, ఫిబ్రవరి 24: వైరా 2, 3 వార్డుల్లోని రిజర్వాయర్ శిఖం భూములను కొందరు ఆక్రమించి వేసిన గుడిసెలను తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం తొలగించారు. ప్రభుత్వ, గ్రామ కంఠం, శిఖం భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మరీదు శాలిని,** W/o : **కృష్ణ, వయస్సు : 36** సం||లు, **వృత్తి :** గృహిణి, **నివాసం :** ఇ.నెం. 120-187, గౌడ బజారు, అశ్వారావుపేట, అశ్వారావుపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** జిల్లా రిజిస్ట్రారు మరియు జిల్లా పరిషత్ ఖమ్మం, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా, సత్తుపల్లి మండల పరిషత్, కాకర్లపల్లి గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా, కాకర్లపల్లి గ్రామ పంచాయితీ రికార్డులలో నమోదు కాబడి వున్న 4-99వ నెంబరు గల ఇంటికి ఉత్తరం ప్రక్కన వున్న 160 చదరపు గజములు, **డాక్యుమెంట్ నెం. 174/2021** గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :**తూర్పు :** కటకం ప్రసన్న గారి 7-13వ నెంబరు గల ఇల్లు, ఆస్తి కొలత 24 అడుగులు, **దక్షిణం :** చల్లారి సక్కుబాయిగారి 4-99వ నెంబరు గల ఇల్లు మరియు చల్లారి సత్యనారాయణ గారి స్థలము, ఆస్తి కొలత 60 అడుగులు, **పడమర :** గ్రామ పంచాయితీ రోడ్డు, ఆస్తి కొలత 24 అడుగులు, **ఉత్తరం :** నాచే క్రయం పొందిన పామర్తి హారిక గారి స్థలము, ఆస్తి కొలత 60 అడుగులు.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జేసీ



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ మధుసూదన్‌నాయక్

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి, 24: తహసీల్దారు కార్యాలయాన్ని శనివారం జేసీ మధుసూదన్‌నాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో ఓటు హక్కులేని యువకులను ఓటర్లుగా నమోదుచేయాలని, పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించాలని తెలిపారు.

## ఉద్యాన తోటల పరిశీలన



సాగును పరిశీలిస్తున్న ఏడీఏ

కూసుమంచి, ఫిబ్రవరి 24: మండలంలోని కేశ్వాపురంలోని మండపల్లి నాగరాజు స్ట్రాబెరీ, గోల్డెన్ బెర్రీ పండ్లను సాగు చేస్తున్నాడు. శనివారం ఏడీఏ విజయ్ చంద్ర, ఏవో వాణి పరిశీలించి సాగు వివరాలను రైతు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విత్తనాలను లంబసింగి నుంచి తీసుకొచ్చానన్నారు. పంట వేసిన తరువాత 45 రోజులకు కాపునకు వచ్చిందన్నారు. ఏఈవోలు రవీంద్రసాయి, వంశీ కృష్ణ, రైతు నాగరాజు పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన డీసీసీబీ చైర్మన్

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 24: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దొండపాటి వెంకటేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేతజౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి సత్కరించారు.

## జమలాపురం ఆలయంలో పూజలు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 24: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే అర్చకులు స్వామికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామికి పట్టువస్త్రాలు అలంకరించి ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు పాలపొంగళ్లు తయారుచేసి స్వామివారికి నివేదించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ పర్యవేక్షకుడు బీ శ్రీనివాస్, ముఖ్యఅర్చకులు విజయదేవశర్మ, సుదర్శనశాస్త్రీ, సీనియర్ అసిస్టెంట్ కే విజయకుమారి పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 24: విద్యార్థులు పరీక్షల పట్ల ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు సమీర అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులకు స్ట్రెస్ రిలీఫ్ టెక్నిక్స్‌ను వివరించారు. హెచ్‌ఈవో సదాశివరావు, ప్రిన్సిపాల్ సరిత, సూపర్‌వైజర్లు జే వెంకటేశ్వరరావు, పద్మావతి, హెల్త్‌అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎంలు స్నేహ, ప్రభావతి, ఆశాకార్యకర్తలు విజయ, హైమావతి, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 24: జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలోని 132/33 కేవీ ఈటీహెచ్ సబ్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయన్నారు. వీవీ పాలెం, పందిళపల్లి, నాగులవంచ, రఘునాథపాలెం, ముచ్చర్ల వంటి గ్రామీణ సబ్ స్టేషన్ల పరిధిలోనూ మరమ్మతులు ఉంటాయని వివరించారు.

# న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలి

### హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్




మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 24: న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా నిజాయితీగా పని చేయాలని అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. శనివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఉమ్మడి ఖమ్మం జిల్లా మహాసభ లో ఆయన మాట్లాడారు. న్యాయ వ్యవస్థల్లో కేసులు పెండింగ్ ఉండడం శ్రేయస్కారం కాదని, త్వరితగతిన తీర్పులు రావడం వల్ల న్యాయస్థానాన్ని ఆశ్రయించే వారికి మేలు జరుగుతుందన్నారు. దాదాపు 50 శాతం కేసులు అనవసరమైనవిగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో న్యాయశాఖకు కేటాయింపులు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. పాలక వర్గాలు సక్రమంగా పనిచేయాలంటే ఎన్నికల్లో ప్రలోభాలను నిలువరించాలని, అందుకు నిజాయితీ గల ఎన్నికల కమిషన్ ఉండాలన్నారు. తొలుత ఐఏఎల్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఐఏఎల్ ఖమ్మం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శిగా ఒరుగంటి శేషగిరిరావు, కార్యదర్శులుగా టీ వెంకట్రావు, అరుణ, ఎం నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కే ఉమామహేశ్వరరావు, ఇమామ్ వలి, కే రమేశ్, కోశాధికారిగా శరత్‌బాబు, మహిళ కార్యదర్శిగా నస్రీన్, ప్రింట్ మీడియా కార్యదర్శిగా జీవీ లక్ష్మీనారాయణ, గౌరవ సభ్యులుగా పారుపల్లి అమర్ చంద్‌ను ఎన్నుకున్నారు.

# విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలి



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఫిబ్రవరి 24: పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఇటీవల వేమన శతకంపై అష్టావధానం చేసిన 5వ తరగతి విద్యార్థి బీ మన్విత్‌కు ఛాంపియన్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు అందజేశారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన వివిధ పరికరాలను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని రోడ్‌నెంబరు 7లో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# నకిలీ బంగారంతో బురిడీ?

- రూ.5 లక్షలకే రెండు కేజీల బంగారమిస్తామన్న ఆగంతకులు
- రూ.1.2 కోట్ల మేలిమి పసిడిని తక్కువకే ఇస్తామంటూ మాటలు
- ఆశతో అప్పు చేసి మరీ వెళ్లి నగదు అప్పజెప్పిన బాధితులు
- తిరిగి వచ్చి పరీక్షించుకున్నాక నకిలీ దని తేలడంతో లబోదిబో

చింతకాని, ఫిబ్రవరి 24: తక్కువ ధరకే మేలిమి బంగారం వస్తుందన్న ఆశతో కొందరు బాధితులు రూ.5 లక్షలను పోగొట్టుకున్న ఘటన చింతకాని మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని నర్సింహాపురం గ్రామానికి బతుకుదెరువు కోసం బాతులు మేపడానికి ఓ వ్యక్తి వచ్చాడు. తనకు తెలిసిన వారి వద్ద బంగారం ఉందని, వారు తక్కువ ధరకే ఇస్తారని చెబుతూ గ్రామంలోని నలుగురిని నమ్మించాడు. మూడో వ్యక్తితో ఫోన్‌లో కూడా మాట్లాడించాడు. మీరు వస్తే మరింత నమ్మకం కలుగుతుందని ఆ మూడో వ్యక్తి చెప్పాడు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రాయచోటికి రమ్మన్నాడు. నలుగురు బాధితులు అక్కడికి వెళ్లగా ఆ మూడో వ్యక్తి మరో నలుగురితో కూడిన ముఠా సభ్యులను పరిచయం చేశాడు. తాము రోజువారీ కూలీలమని, ఇటీవల ఓ ఇంటి నిర్మాణం కోసం తవ్వుతుండగా బంగారంతో నిండిన కుండలు దొరికాయని, వాటిల్లో రెండు కేజీల బంగారు నాణేలు, గుండ్లు ఉన్నాయని ఆ ముఠా సభ్యులు వివరించారు. అందులోంచి తాము కొంత బంగారాన్ని ఇస్తామని, పరీక్షించుకున్నాక నిజమని తేలితేనే నగదు ఇవ్వాలని అన్నారు. అందుకోసం ఒక గ్రాము బంగారాన్ని కూడా ఇచ్చారు. దీంతో బాధితులు ఆ బంగారాన్ని తీసుకుని ఖమ్మం వచ్చి ఓ నగల దుకాణంలో పరీక్షంచగా నిజమైన బంగారమేనని తేలింది. రెండు రోజుల తర్వాత ముఠా సభ్యులు ఫోన్ చేయడంతో అది నిజమైన బంగారమేనని బాధితులు కూడా చెప్పారు. అయితే తమ డబ్బులు అత్యవసరమని, తమ వద్దకు వస్తే రెండు కేజీల బంగారాన్ని రూ.5 లక్షలకే ఇస్తామని చెప్పారు. దీంతో సుమారు రూ.1.2 కోట్ల విలువైన బంగారం రూ.5 లక్షలకే వస్తుందనే ఆశతో బాధితులు ఆ బంగారాన్ని కొనేందుకు నిశ్చయించుకున్నారు. తమ వద్ద డబ్బులు లేకపోయినా గ్రామంలో అప్పు చేసి మరీ డబ్బులు సమకూర్చుకున్నారు. ముఠా సభ్యులకు ఫోన్ చేయగా మళ్లీ రాయచోటికి రావాలని చెప్పారు. బాధితులు అక్కడికి వెళ్లాక ఈసారి ఆరుగురు ముఠా సభ్యులు వచ్చారు. బాధితులకు ఓ సంచి ఇచ్చి అందులో బంగారం ఉందని చెప్పారు. తర్వాత బాధితులు ఇచ్చిన రూ.5 లక్షలను తీసుకొని వెళ్లిపోయారు. తక్కువకే బంగారం వచ్చిందనే ఆనందంతో ఖమ్మానికి చేరుకున్న బాధితులు.. మరునాడు కొంత బంగారాన్ని తీసుకెళ్లి మళ్లీ ఖమ్మంలోని ఓ నగల దుకాణంలో పరీక్షించారు. దీంతో అది నకిలీ బంగారమని తేలింది. దీంతో తాము మోసపోయామని గ్రహించారు. అప్పు తెచ్చి మరీ కొన్న బంగారం నకిలీదని తెలిస్తే ఇంట్లో గొడవలవుతాయనే కారణంతో బాధితులు బయటకు చెప్పలేదు. అయితే అప్పులిచ్చినవారు ఒత్తిడి చేయడంతో అసలు విషయాన్ని కుటుంబ సభ్యులతో చర్చించారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది.

# ప్రధాని దిష్టిబొమ్మ దహనం

వైరా టౌన్, ఫిబ్రవరి 24: ఢిల్లీలో రైతుల ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం అణచివేత చర్యలను నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో సీపీఎం నాయకులు శనివారం దహనం చేశారు. భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి, ఫిబ్రవరి 24: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను సీపీఎం నాయకులు శనివారం దహనం చేశారు. నరేంద్ర, కొండబోయిన నాగేశ్వరరావు, తలారి దేవప్రకాష్, సీతారాములు, సంపత్, బీముడు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 24: ఢిల్లీలో రైతుల ఉద్యమానికి మద్దతుగా తిరుమలాయపాలెంలో శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొమ్ము శ్రీను, అంగిరేకుల నర్సయ్య, బింగి రమేశ్, నాగేశ్వరావు, దొండేటి నిర్మల్‌రావు, వశపొంగు వీరన్న, అల్లి యశోద పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి అరుణకుమారి

సత్తుపల్లి, ఫిబ్రవరి 24: మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సత్తుపల్లి సీనియర్ సివిల్‌జడ్జి పీ అరుణకుమారి అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు ఉన్న హక్కులు, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ శ్రీనివాసరావు, న్యాయవాదులు నల్లగట్ల విజయ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో కొండమ్మ, సూపర్‌వైజర్లు, టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



జక్కంపూడిని పరామర్శిస్తున్న సండ్ర

వేంసూరు, ఫిబ్రవరి 24: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం మండలంలో పర్యటించారు. తొలుత కుంచపర్తిలోని ఆరెంపుల రవి నివాసంలో ఇటీవల గ్యాస్‌బండ పేలి వస్తువులు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న సండ్ర వారి ఇంటికి వెళ్లి రవిని పరామర్శించారు. సండ్ర వెంట ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, పుల్లారెడ్డి, ప్రసాద్, కృష్ణయ్య, టైలర్ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రేగళ్ల ప్రసాదరెడ్డి ఉన్నారు.

### జక్కంపూడికి సండ్ర పరామర్శ

కల్లూరు, ఫిబ్రవరి 24: తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన జక్కంపూడి కృష్ణమూర్తి అనారోగ్యంతో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆయన నివాసానికి వెళ్లి కృష్ణమూర్తిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు వీరమోహనరెడ్డి, వెంకటలాల్, కోటారెడ్డి, చలపతిరావు, మురళి ఉన్నారు.

## మాజీ సర్పంచ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న లింగాల, కొండబాల

మధిరరూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని ఖాజీపురం మాజీ సర్పంచ్, మధిర కోఆప్షన్ సభ్యుడు మహ్మద్‌అలీ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మహ్మద్‌అలీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గీతాంజలి వార్షికోత్సవ వేడుక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24: నగరంలోని గీతాంజలి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నదని కొనియాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలుగించాయి. ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ తాండ్ర వెంకట అప్పారావు, డైరెక్టర్స్ పద్మ, అరుణ్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, మెంటర్స్ ఐఐటీ అకాడమీ డైరెక్టర్ గద్దె మోహన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హార్వెస్ట్ ప్రైమరీ వార్షికోత్సవ వేడుక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శైలజ, శ్రీలత, రవిమారుత్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24: నగరంలోని హార్వెస్ట్ పాఠశాల ప్రైమరీ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ బోడేపూడి శైలజ, శ్రీలత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హార్వెస్ట్ పాఠశాలను నెలకొల్పి ఎంతోమందిని ఉన్నతంగా తీర్చిదిద్దడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. విద్యాసంస్థల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ముదిగొండ, ఫిబ్రవరి 24: దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని రక్షించటానికి సీపీఎం కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం మండలంలోని కమలాపురం గ్రామంలో ఇటీవల మరణించిన ఈ పార్టీ కార్యకర్త సంతాప సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని హిందూత్వ ఫాసిస్ట్ దేశంగా మార్చేందుకు సంఘ్ పరివార్, బీజేపీ చూస్తున్నాయన్నారు. పోతినేని సదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేశ్, బండి పద్మ, బట్టు పురుషోత్తం, మంకెన దామోదర్, టీఎస్ కల్యాణ్, భద్రయ్య పాల్గొన్నారు.

## రామాలయానికి రూ.5 లక్షల విరాళం

కూసుమంచి, ఫిబ్రవరి 24: మండలంలోని గోరీలపాడుతండాలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయానికి ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ సరస్వతి దంపతులు రూ.5లక్షలు శనివారం కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. శంకర్, రామకోటి, రాజ్‌కుమార్, భాసు, బాబు, నాగులు నాయక్, పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 24: గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం లభ్యమైందని పోలీసులు తెలిపారు. బొక్కలగడ్డ మున్నేరు ప్రాంతంలో నీటిలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని అన్నం శ్రీనివాసరావు ఫౌండేషన్ సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని త్రీటౌన్ సీఐ రమేశ్ తెలిపారు. మృతి చెందిన మహిళ వయస్సు సుమారు 60 ఏళ్లకు పైన ఉంటుందని, మృతదేహాన్ని గుర్తించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి వెళ్లి గుర్తించాలని సూచించారు. వివరాలకు 8712659115, 9347719343ను సంప్రదించాలన్నారు.

## కేసు విషయంలో వ్యక్తికి కౌన్సిలింగ్

కల్లూరు, ఫిబ్రవరి 24: మండలానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు ఓ కేసు విషయంలో అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం(రాళ్ల బంజర) గ్రామానికి చెందిన శంకర్‌రావును శనివారం పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు భారీగా పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. శంకర్‌రావును ఎలా, ఏ విషయంలో అదుపులోకి తీసుకుంటారని ప్రశ్నించారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం తగదన్నారు. దీనిపై ఎస్సై షాకీర్‌ను 'నమస్తే' వివరణ కోరగా.. శంకర్‌రావును సివిల్ కేసు విషయంపై పిలిపించలేదని, మండల వ్యాప్తంగా కోడి పందేలు, పేకాట ఆడుతున్న జూదరులను పిలిపించామని, అందులో భాగంగానే శంకర్‌రావుని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామని సమాధానమిచ్చారు.

# వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కూసుమంచి, ఫిబ్రవరి 24: మండలంలోని జీళ్ల చెరువు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నమున స్వామి వారి తిరు కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పొంగులేటి ప్రసాదరెడ్డి ఆయన సతీమణి లక్ష్మి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 24: కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి శనివారం మండలంలో పర్యటించారు. తొలుత కరుణగిరి ప్రాంతంలో పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న పాలేరు నియోజకవర్గం క్రికెట్ పోటీలను ఆయన తిలకించారు. అనంతరం తీర్థాల సంగమేశ్వర ఆలయంలో, రెడ్డిపల్లి గ్రామంలో మారెమ్మ తల్లి ఆలయంలో ప్రసాదరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కళ్లెం వెంకటరెడ్డి, బైరి హరినాధబాబు, వీరారెడ్డి, రామ్మూర్తి, భుజంగరెడ్డి, అశోక్, కుర్మారావు, భద్రకాళి పాల్గొన్నారు.

**సంక్షిప్తం**

## సత్యసాయి మందిరంలో రజతోత్సవాలు

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 24: నేలకొండపల్లిలోని శ్రీ షిర్డీ సత్యసాయి మందిరంలో రజతోత్సవాల సందర్భంగా శనివారం అర్చకులు భజనలు, పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

## మెనుస్ట్రువల్ హైజిన్‌పై ఆన్‌లైన్ శిక్షణ

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారికత విభాగం, గ్లోబల్ హంట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'మహిళా సాధికారిత మెనుస్ట్రువల్ హైజిన్' అంశంపై ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఢిల్లీకి చెందిన నిత్యాచౌదరి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సాధికారిత విభాగం కార్యదర్శి సుభాషిణి, సభ్యులు మాధవి, రాజ్యలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

## సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 24: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నిధులు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మండలంలోని మీనవోలులో రూ.10 లక్షలు, పెద్దగోపవరంలో రూ.19 లక్షలు, కాచవరంలో రూ.2 లక్షలతో నిర్మించనున్న సీసీ పనులకు ప్రజాప్రతినిధులు, నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ శిరీష, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతుల వినతి

కొణిజర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని సాలెబంజర గ్రామంలో అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు శనివారం విద్యుత్ శాఖ ఏఈ, డీఈలకు వినతిపత్రం ఇచ్చారు. వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ బాణోత్ నరసింహారావు, వార్డు మెంబర్ లకావత్ లచ్చు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌కు ఆర్థికసాయం

మధిర, ఫిబ్రవరి 24: మధిర ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న పుల్లారావు కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొన్ని నెలలుగా వేతనం రాక ఆర్థిక ఇబ్బంది పడుతుండడంతో ఎంప్లాయీస్ యూనియన్ సభ్యుడు పుల్లారావు కుటుంబానికి శనివారం ఆర్థికసాయం అందించారు. యూనియన్ నాయకులు తిమ్మినేని రామారావు తదితరులు ఉన్నారు.

## 'న్యూరిడ్జ్' పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24: ఖమ్మంలోని న్యూరిడ్జ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్‌ఎక్స్‌పో ప్రారంభమైంది. సీఐ శ్రీహరి, కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, పల్లెబోయిన చంద్రం ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆలోచింపచేశాయి. కరస్పాండెంట్ కాపూరి పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 24: కుల వివక్ష వ్యతిరేక పోరాటసంఘం–2024 డైరీని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి శనివారం ఏసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

బోనకల్లు, ఫిబ్రవరి 24: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అన్నారు. శనివారం బోనకల్లులో జరిగిన యూటీఎఫ్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో తాత్సారం తగదన్నారు.

## క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 'మిస్ట్' విద్యార్థులు

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో సియోన్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ప్లేస్‌మెంట్‌లో 39 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, డీన్ జాకీర్‌హుస్సేన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, భార్గవ్ అభినందించారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నెల పింఛన్ విరాళం

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 24: ఖమ్మం నగరానికి చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ గులాం జాఫర్ తన ఒక నెల పింఛన్ రూ.20 వేలను రాష్ట్ర ప్రభుత్వానికి విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


మన రాష్ట్రం మన పత్రిక
**నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds**

**మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును**



★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899.
NT-319957

**ప్లాట్లు కొనబడును**



★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

**WANTED**

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
**నమస్తే తెలంగాణ**



నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616